ఎవరూ అధైర్యపడొద్దు..

- అర్హులందరికీ పథకాలు అందుతాయి
- అన్నారంలో లాంఛనంగా నాలుగు పథకాల ప్రారంభం
- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

అన్నారం గ్రామంలో లబ్ధిదారుకు పథకం పత్రాన్ని అందజేస్తున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి

కొడంగల్, జనవరి 26 : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డు, రైతు భరోసా వంటి పథకాలను అమలు చేసింది. ఇందులో భాగంగా ఆదివారం మండల పరిధిలోని అన్నారం గ్రామంలో కొత్త పథకాల ప్రారంభ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. రిపబ్లిక్ డే రోజున ప్రభుత్వం నాలుగు పథకాలను అమల్లోకి తీసుకురాగా.. అన్నారం గ్రామంలో లాంఛనంగా ప్రారంభించామని.. పథకాలు అందలేదని ఎవరూ అధైర్యపడొద్దని.. అర్హులందరికీ అందుతాయని భరోసా కల్పించారు. జాబితాల్లో పేరు రాని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామంలో 962 మందికి రైతు భరోసా, 13 మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, 294 మందికి కొత్తగా రేషన్ కార్డులు మంజూరు కాగా వాటిని అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్పీ నారాయణరెడ్డి, మండల ప్రత్యేకాధికారి జ్ఞానేశ్వర్, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఏడీఏ శంకర్‌రాథోడ్, ఎంపీడీవో ఉషశ్రీ, సీఐ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంగాయిపల్లిలో..

అలాగే దుద్యాల మండల పరిధిలోని సంగాయిపల్లిలో డీఎల్‌పీవో శంకర్‌నాయక్, తహసీల్దార్ కిషన్ నాలుగు పథకాలను ప్రారంభించారు. 9 మందికి ఆత్మీ భరోసా, 174 మందికి రైతు భరోసా, 10 మందికి కొత్త రేషన్ కార్డులు, 91 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా.. వాటిని లబ్ధిదారులు పంపిణీ చేస్తామన్నారు. ఇందులో డీటీ వీరేశ్‌బాబు, ఎంపీడీవో శ్రీనివాస్, ఏవో హిమబిందు, ఏఈవో లావణ్య, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

దుద్యాల మండలంలోని సంగాయిపల్లిలో నిర్వహించిన గ్రామ సభలో పాల్గొన్న అధికారులు

ఆదరణ కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ

- ఆ పార్టీ నాయకుల మాటలకు మోసపోయామని గ్రహించిన ప్రజలు
- బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం
- పదేండ్లలో జరిగిన అభివృద్ధిని ప్రజల్లో చర్చించాలి
- మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్

షాద్‌నగర్, జనవరి 26 : గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీని నమ్మేస్థితిలో లేరని మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్యయాదవ్ అన్నారు. కాంగ్రెస్ మోసపూరిత మాటలకు మోసపోయామనే విషయాన్ని వారు తెలుసుకున్నారని చెప్పారు. ఆదివారం షాద్‌నగర్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ ఆవరణలో పదవిని ముగించుకున్న మున్సిపల్ కౌన్సిలర్లను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజకీయాల్లో పదవులు రావడం, పోవడం సహజమన్నారు. మనం పదవుల్లో ఉన్నప్పుడు ప్రజలకు ఏ మేర సహాయం, సేవ చేశామన్నదని ముఖ్యమనే విషయాన్ని ప్రజాప్రతినిధులు, నాయకులు గ్రహించాలని కోరారు. రాజకీయ వ్యవస్థలో పార్టీ బలంగా ఉంటేనే మనందరం బలంగా ఉంటామని, అందుకు పార్టీ బలోపేతం కోసం పనిచేయాలన్నారు. పార్టీని నమ్ముకున్న వారికి కచ్చితంగా పదవులు వస్తాయని అన్నారు. ప్రజలకు సంక్షేమాన్ని అందించడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. పదేండ్లలో బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిపై క్షేత్రస్థాయిలో చర్చ పెట్టాలని పిలుపునిచ్చారు. దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెస్, టీడీపీ పాలకులు చేసిన అభివృద్ధి, కేవలం పదేండ్లలో కేసీఆర్ చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు తెలుసని చెప్పారు. షాద్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం తనవంతుగా కృషిచేశానని, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు రూ.16 కోట్ల నిధులను మంజూరు చేయడంతో పాటు కళాశాల ప్రారంభానికి చర్యలు తీసుకున్నామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా వారు ఇచ్చిన హామీలు అమలయ్యాయో? లేదో ? అందరికీ తెలుసన్నారు. మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్‌తో పాటు కౌన్సిలర్లను సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఈటె గణేశ్, వంకాయల నారాయణరెడ్డి, కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణ, రాజ్యలక్ష్మి, ఆకుల శ్రీశైలం, యాదగిరిచారి, రవీందర్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్పారెడ్డిగూడలో రేషన్ కార్డులను అందజేస్తున్న టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్

పరస్పర సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

నందిగామ, జనవరి 26 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరస్పర సహకారంతోనే అభివృద్ధి సాధ్యం అవుతుందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను అదివారం మండల పరిధిలోని అప్పారెడ్డిగూడలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు అన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదన్నారు. ఇందులో భాగంగా మొదట మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ప్రారంభిస్తున్నామని, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ప్రతాప్‌రెడ్డి, కృష్ణారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ కుసుమకుమార్, మాజీ జడ్పీటీసీలు శ్యామ్ సుందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, నందిగామ తహసీల్దార్ రాజేశ్వర్, ఎంపీడీవో సుమతి, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

- అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- పెండ్లిమడుగులో నాలుగు పథకాలు ప్రారంభం

లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందజేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్, జనవరి 26 : వికారాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని పెండ్లిమడుగులో ప్రజాపాలనలో భాగంగా నాలుగు సంక్షేమ పథకాలను ప్రారంభించారు. అర్హులైన లబ్ధిదారులకు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ పత్రాలను అడిషనల్ కలెక్టర్ సుధీర్, పార్టీ నాయకులతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌టీఏ డైరెక్టర్ జాఫర్, పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, నాయకులు మహిపాల్ రెడ్డి, కిషన్ నాయక్, చిగుళ్లపల్లి రమేశ్, నారాయణరెడ్డి, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు

కొడంగల్ పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు

కొడంగల్, జనవరి 26 : అక్రమంగా అరెస్టు సరికాదని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం నియోజకవర్గ పరిధిలోని కోస్గి మండలం చంద్రవంచ గ్రామంలో సంక్షేమ పథకాల అమలులో భాగంగా సీఎం విచ్చేశారు. ముందస్తుగా నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ నాయకులను ఎక్కడిక్కడ పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజ్యాంగ అవతరణ దినోత్సవం రోజు దేశానికి రాజ్యాంగం వచ్చిందని సంతోషపడాలా..? సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్నారని అక్రమంగా అరెస్టు చేయడానికి బాధపడాలా అర్థం కావడం లేదని, అక్రమ అరెస్టులను ఖండించారు. దేశం మొత్తం గణతంత్ర వేడుకలను ఘనంగా జరుపుకొంటుంటే, కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో బీఆర్ఎస్ నాయకులు పోలీస్ స్టేషన్‌లో గడపాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నియోజకవర్గానికి రావడానికి బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేయడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. అర్ధరాత్రి నుంచి మధ్యాహ్నం వరకు పోలీస్‌స్టేషన్‌లో ఉంచారని తెలిపారు. అక్రమ అరెస్టులు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనంగా పేర్కొన్నారు. అరెస్టు అయిన వారిలో కొడంగల్ మున్సిపల్ పరిధిలో కౌన్సిలర్ మధుసూదన్‌రావు యాదవ్, మాజీ సర్పంచ్ రమేశ్‌బాబు, బొంరాస్‌పేటలో బీసీ సెల్ మండల అధ్యక్షుడు రవిగౌడ్, మాజీ ఎంపీటీసీ తిరుపతి, మాజీ కో ఆప్షన్ సభ్యుడు జలీల్, గ్రామ అధ్యక్షుడు బండ శ్రీనివాస్, దుద్యాలలో మడిగె శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బొంరాస్‌పేట పోలీస్‌స్టేషన్‌లో..

దుద్యాల పోలీస్‌స్టేషన్‌లో..

గణతంత్ర వేడుకలకు దూరం

కేశంపేట : వ్యవసాయ శాఖ కార్యాలయంపై ఎగురని జాతీయ పతాకం

కేశంపేట, జనవరి 26 : మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ అధికారులు గణతంత్ర వేడుకలకు దూరంగా ఉన్నారు. మండల పరిధిలోని అన్ని కార్యాలయాల్లో వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో జెండాను ఎగురవేయకపోవడంతో బోసిపోయినట్లు కనిపించింది. ఈ విషయమై ఏవో శిరీషను వివరణ కోరగా తాను కాకునూరులో జరుగుతున్న కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు. ఏఈవోలు రైతు వేదికల వద్ద వేడుకలను నిర్వహిస్తున్నారని తెలిపారు. వ్యవసాయశాఖ కార్యాలయం సొంత భవనం కాకపోవడంతోనే వేడుకలు నిర్వహించలేకపోయామని ఏవో చెప్పడం ఆశ్చర్యానికి గురి చేసిందని చెప్పవచ్చు. వ్యవసాయ శాఖ కార్యాలయంలో వేడుకలు నిర్వహించకపోవడంపై స్పందించిన ఏడీ రాజారత్నం ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

జంషీద్‌పూర్ పాఠశాలలో..

మర్పల్లి : మండల పరిధిలోని జంషీద్‌పూర్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాలలో గణతంత్ర వేడుకలు నిర్వహించలేదు. గతేడాది జూలైలో ప్రభుత్వం ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్లు చేపట్టగా ఇక్కడ విధులు నిర్వహించిన ఉపాధ్యాయుడు ప్రమోషన్‌లో భాగంగా వేరే పాఠశాలకు బదిలీ అయ్యాడు. అక్కడ చదివే విద్యార్థులు ఇతర ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్నారని, పేద పిల్లలు చాలా ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు అందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయుడు బదిలీపై వెళ్లినప్పటి నుంచి బడి మూతపడిందని, పాఠశాలలో 5వ తరగతి వరకు ఉండేదని, 6వ తరగతి నుంచి వేరే పాఠశాలలకు వెళ్లి విద్యార్థులు చదువుకునే వారని తెలిపారు. సంబంధిత అధికారులు పాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమించి పాఠశాలను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మర్పల్లి: జంషాదపూర్ పాఠశాలలో ఎగరని జెండా

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

కులకచర్ల, జనవరి 26 : అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని సమగ్రశిక్షా అభియాన్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు, సీఆర్పీ గంగ్యానాయక్ అన్నారు. ఆదివారం సీఎం పర్యటన సందర్భంగా ఉదయం సీఎం దగ్గరకు వెళ్లకుండా ముందు జాగ్రత్త చర్యగా బైండోవర్ చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణతంత్ర దినోత్సవం రోజు ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలు ఇస్తూ పోలీసులు తమను అరెస్టు చేయడం తగదన్నారు. తెలంగాణ సమగ్ర శిక్షాలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు సీఎం ఇచ్చిన హామీని అమలు చేయాలని పోరాటం చేస్తుంటే తమను అరెస్టు చేయడం విడ్డూరమన్నారు. నెల రోజుల పాటు ఉద్యమం చేశామని ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

గంగ్యానాయక్‌ను అరెస్టు చేసిన కులకచర్ల పోలీస్

మహానగరంలో బృందావనం

- అద్భుతమైన పర్యాటక కేంద్రంగా ఎక్స్‌పీరియం బొటానికల్ గార్డెన్
- ప్రకృతి, పర్యావరణాన్ని భావితరాలకు అందించడమే నా సంకల్పం
- గార్డెన్‌లో రూ.150 కోట్ల విలువైన మొక్కలను నాటా..
- 28న ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- గార్డెన్ చైర్మన్ రామ్‌దేవ్ రావు



రంగారెడ్డి జిల్లాలోని ఎక్స్ పీరియం బొటానికల్ గార్డెన్‌లో మాట్లాడుతున్న గార్డెన్ చైర్మన్ రామ్‌దేవ్ రావు

మొయినాబాద్, జనవరి 26 : పర్యావరణం... అందమైన ప్రకృతిని భావితరాలకు అందించడానికి అద్భుతమైన పర్యాటక కేంద్రంగా ఎక్స్ పీరియం బోటానికల్ గార్డెన్‌ను ఏర్పాటు చేశామని ఆ గార్డెన్ చైర్మన్ రామ్‌దేవ్ రావు అన్నారు. ఈ నెల 28న సీఎం రేవంత్ రెడ్డి ఈ గార్డెన్‌ను ప్రారంభించనున్నారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. వరంగల్ జిల్లాలో చిన్న మారుమూల గ్రామంలో పుట్టానని, తన తండ్రి ప్రకృతి ప్రేమికుడని, ఆయన స్ఫూర్తితోనే ఎక్స్ పీరియం బొటానికల్ గార్డెన్‌ను ఏర్పాటు చేశానని చెప్పారు. తన తండ్రి కలప వ్యాపారం చేసే వాడని.. అది మానేసి మళ్లీ అడవిని సృష్టించాలనే సంకల్పంతో 80 ఎకరాల్లో అడవిని సృష్టించారని తెలిపారు. ఇది 25 ఏండ్ల కల అని, ఇప్పుడు సాకారం అయిందని చెప్పారు. ఇందు కోసం 12 ఏండ్ల క్రితం యూనిక్ ట్రీస్ అనే కంపెనీని ఏర్పాటు చేశానని పేర్కొన్నారు. ప్రపంచంలోని 175 దేశాల్లో పర్యటించి అరుదైన మొక్కలు, వృక్షాలు సేకరించి సెలబ్రిటీలకు అందించానని తెలిపారు. వారిలో మెగాస్టార్ చిరంజీవితో పాటు షారుక్ ఖాన్, రాణి ముఖర్జి, ప్రభాస్, జూనియర్ ఎన్టీఆర్ , అల్లుఅర్జున్, ప్రముఖ వ్యాపారవేత్తలు ముఖేష్ అంబానీ, నవీన్ జిందాల్, అదానీలకు అరుదైన మొక్కలను అందించినట్లు తెలిపారు. యూనిక్ ట్రీస్ తర్వాత ఆరున్నరేండ్ల క్రితం ఈ ఎక్స్ పీరియం కోసం పని ప్రారంభించానని తెలిపారు.

85 దేశాలు తిరిగి..

ఎక్స్ పీరియం బొటానికల్ గార్డెన్‌ను ఏర్పాటు చేయడానికి 8 ఏండ్ల పాటు శ్రమించానని రామ్‌దేవ్ రావు అన్నారు. అర్జెంటీనా, ఉరుగ్వే, మెక్సికో, సౌత్ అమెరికా, స్పెయిన్, ఇటలీ, పప్వా న్యూగినియా, ఆస్ట్రేలియా, థాయ్‌లాండ్ ఇండోనేషియా, మలేషియా తదితర 85 దేశాలు తిరిగి అనేక అరుదైన చెట్లు, మొక్కలను సేకరించి గార్డెన్‌లో ఏర్పాటు చేశామన్నారు. వివిధ దేశాల నుంచి రకరకాల స్టోన్స్, శిలలను తీసుకొచ్చినట్లు వివరించారు. గార్డెన్‌లో ఏర్పాటు చేసిన మొక్కలు, చెట్లకు సుమారుగా రూ.150 కోట్లు వెచ్చించి కొనుగోలు చేశానని తెలిపారు. వీటిని విదేశాల్లో సేకరించి వాటిని ఇక్కడికి తీసుకు రావడానికి ఎయిర్ లిఫ్టింగ్, షిప్పింగ్, రిఫ్రిజిరేటర్ కంటెయినర్స్ ద్వారా తీసుకు రావడాని కి రూ.కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. చెట్లతో పాటు ఒక్కో శిల్పానికి రూ.5 లక్షల నుంచి రూ. కోటి వరకు ఖర్చు చేసి తీసుకొచ్చామన్నారు. వీటిలో సహజ శిలల కోసం రూ.15 కోట్లు ఖర్చు చేశానని తెలిపారు.

రూ.50కోట్లతో.. 150 ఎకరాల్లో..

రూ.50 కోట్ల వ్యయంతో 150 ఎకరాల్లో వికసించేలా గ్లో గార్డెన్‌ను ఏర్పాటు చేశామని రామ్‌దేవ్ రావు చెప్పారు. వీటితో పాటు 1500 మందికి సరిపోయే ఇండియాలోనే అతిపెద్ద హంపి థియేటర్ ఏర్పాటు చేశామన్నారు. 20 స్టెయిన్ లెస్ స్టీల్ శిల్పాలు ఏర్పాటు చేశామన్నారు. ఇండియాలోనే మొదటి సారిగా రూ.50 కోట్లతో విలువైన 12 ఎకరాల్లో మ్యాన్ మేడ్ బీచ్ ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. 10 వేల మందికి సరిపోయే కన్వెన్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నామన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని అనేక ప్రత్యేకతలు, వైవిధ్యాలతో ఈ ఎక్స్ పీరియం రూపొందిస్తున్నామని చెప్పారు. ఎక్స్ పీరియంతో అంతర్జాతీయ, జాతీయ పర్యాటకం పెరుగుతుందనే నమ్మకం ఉందని, అనేక అవార్డులు రానున్నాయని, వరల్డ్ రికార్డు సాధిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ నెల 28న సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మెగాస్టార్ చిరంజీవి ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారని చెప్పారు.

అలరించిన ప్రదర్శనలు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఆదివారం గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన శకటాల ప్రదర్శన ఆకట్టుకున్నది.

- న్యూస్ నెట్‌వర్క్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా, జనవరి 26

డీఈవోకు ఉత్తమ అవార్డు అందజేస్తున్న రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

ఉత్తమ అవార్డు అందజేస్తున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్ జిల్లాలో..

రంగారెడ్డి జిల్లాలో..